జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

బుధవారం | 09-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 778 పేజీలు: 4 వెల : రూ.7

# సచివాలయాల్లో.. కూటమి నేతల పాగా!



✳ కొత్త పింఛన్ల దరఖాస్తులు వారు పరిశీలించిన తర్వాతే నమోదు ✳ ప్రతిపక్షాలు నిలదీస్తే ఇది మా ప్రభుత్వం అంటూ అహంకార పూరిత సమాధానం ✳ నిలదీస్తున్న ప్రతిపక్ష నేతలు ✳ చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు ✳ కొత్తగా సామాజిక పింఛన్లకు దరఖాస్తు చేసేందుకు బారులు దీరిన లబ్ధిదారులు ✳ కిటకిటలాడుతున్న సచివాలయ ప్రాంగణాలు ✳ సర్వర్ మొరాయింపుతో ఇక్కట్లు

శ్రీకాకుళం, సెప్టెంబర్ 8 (వార్త): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల దరఖాస్తుకు కూటమి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సచివాలయాలకు లబ్ధిదారులు తరలివస్తున్నారు. పెద్ద ఎత్తున ప్రజలు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసేందుకు రావడంతో గ్రామ, వార్డు సచివాలయాలు సందడిగా మారాయి. అయితే సర్వర్లు మొరాయింపుతో సచివాలయ సిబ్బంది ఇబ్బందితో పాటు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్నందున ఆయా పార్టీ నాయకులు సైతం గ్రామాల్లో ఎవరెవరు అర్హులు ఉన్నారన్న దానిపై ఆరా తీసి వారితో నూతన పింఛన్ కోసం దరఖాస్తు చేయిస్తున్నారు. ఇక టీడీపీ నాయకులైతే ఒక అడుగు ముందుకువేసి తాము చెప్పిన వారి దరఖాస్తులు మాత్రమే నమోదు చేయాలని సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. ఏకంగా వారు సచివాలయాల్లో పాగా వేశారు. ఇది తమ ప్రభుత్వమని, తాము చెప్పింది చేయాలని, లేకుంటే బదిలీ అయిపోతారని కొందరు అధికార పార్టీ నేతలు జులుం ప్రదర్శిస్తుండడంతో దీంతో సచివాలయ సిబ్బంది కొంత ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చూసీచూడనట్టు వెళ్లిపోండని చెబుతున్నట్టు కొందరు సచివాలయ సిబ్బంది పేర్కొంటున్నారు. కాగా, జిల్లాలోని 657 గ్రామ, వార్డు సచివాలయాలు రద్దీగా మారాయి. సోమ, మంగళవారం నాటికి సుమారు 20వేల మంది కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో 3,04,344 మందికి పింఛన్‌దారులు ఉన్నారు. ఈ నెల 16 వరకూ దరఖాస్తులు స్వీకరించనున్న విషయం తెలిసిందే. 17 నుంచి 21 వరకూ అర్హతల తనిఖీ, క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నారు. ఈ నెల 22 నుంచి 24 వరకూ ఎంపీడీవో/మునిసిపల్ కమిషనర్/జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలన ఉంటుంది. ఆ తరువాత అర్హులందరికీ పింఛన్ మంజూరు చేసేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

## సచివాలయంలో తెలుగు తమ్ముళ్ల హల్‌చల్

ఇచ్ఛాపురం సెప్టెంబర్8 (వార్త):రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్లు దరఖాస్తులు స్వీకరిస్తున్న వేళ స్వర్ణ సచివాలయాల్లో తెలుగు తమ్ముళ్లు హల్‌చల్ చేస్తూన్నారని వైస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు బలివాడ ప్రకాష్ రావు పట్నాయక్ అన్నారు. పసుపు టీ షర్టు వేసుకున్న వ్యక్తి సచివాలయం అనామక ఉద్యోగిలా దర్జాగా అఫీషియల్ సీట్లో కూర్చుని పని చేస్తున్నారన్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ 9వ వార్డు కార్యకర్త రాహుల్ కుమార్ సాహు ఎన్ టీ ఆర్ భరోసా పెన్షన్ ధ్రువపత్రాలు వెరిఫికేషన్ చేసి ఒరిజినల్ ప్రభుత్వ ఉద్యోగికి అందజేసి తాను ఓకే చేసిన దరఖాస్తులు మాత్రమే కంప్యూటరీకరణ చేయమని హుకుం జారీ చేసే కార్యక్రమం చేస్తున్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని 9వ స్వర్ణ వార్డు కార్యాలయంలో జరుగుతుందని అన్నారు. అధికారులు ఏం చేస్తున్నారు ఎటు పోతుంది ఈ రాష్ట్రం అని ఆయన ప్రశ్నించారు. ఫకీర్ పేట స్వర్ణ సచివాలయం లో ఉదయం 11 వరకు తలుపులు తెరవక పోవడంతో దరఖాస్తు దారులు ఎదురు చూపులు చూస్తున్నారని వైస్సార్సీపీ నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ సాలిన గాంధీ యాదవ్ అన్నారు. వార్డు లలో టీడీపీ ఇంచార్జ్ స్టాంప్ వేస్తేనే దరఖాస్తులు స్వీకరిస్తున్నారని జిల్లా వైస్సార్సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతి దివ్య ఆరోపించారు.

# వైసీపీకి షాక్







✳ పార్టీకి రాజీనామా చేసిన చిన్న శ్రీను ✳ చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన బొత్స మేనల్లుడు ✳ బొత్సతో వివాదాలే కారణం

శ్రీకాకుళం, సెప్టెంబర్ 8 (వార్త): విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు, భీమిలి ఇంఛార్జి, బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు పార్టీకి రాజీనామా వేశారు. తన రాజీనామా లేఖను అధినేత జగన్‌కు పంపించారు. ఆ తర్వాత చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు ఉత్తరాంధ్రలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. ఈ సందర్భంగా చిన్న శ్రీనుకు చంద్రబాబు.. తెలుగుదేశం కండువా కప్పి పార్టీలోకి చంద్రబాబు ఆహ్వానించారు. అంతకుముందు వైసీపీకి, పదవులకు చిన్న శ్రీను రాజీనామా చేశారు. వైసీపీ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, విజయనగరం జిల్లా అధ్యక్ష పదవికి, భీమిలి నియోజకవర్గం ఇంఛార్జి పదవికి చిన్న శ్రీను రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నానంటూ రాజీనామా లేఖను వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పంపించారు. కాగా, చిన్న శ్రీనుకు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు గత కొన్నిరోజులుగా కోల్డ్ వార్ జరుగుతోంది. తన కుమార్తె రాజకీయ రంగ ప్రవేశం కోసమే చిన్న శ్రీను వైసీపీకి రాజీనామా చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. కుమార్తెను స్థానిక ఎన్నికలలో బరిలో నిలపాలని.. విజయనగరం జెడ్పీ ఛైర్మన్ ఎన్నికలలో పోటీ చేయించాలని ఆయన భావిస్తున్నట్లు గుసగుసలు వినిపించాయి. ఈ విషయంలోనే బొత్స సత్యనారాయణ, మజ్జి శ్రీనివాసరావు మధ్య కొంత పొరపొచ్చాలు వచ్చినట్టు సమాచారం. అయితే ఎవరూ ఊహించని రీతిలో చిన్న శ్రీను టీడీపీలోకి కుమార్తె సిరి సహస్ర, అనుచరులతో కలిసి చేరిపోయారు. అనంతరం చంద్రబాబు.. మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కళావెంకట్రావు, కొండ్రు మురళి, కోళ్లలలితకుమారి సహా పలువురు నేతలతో సమావేశమయ్యారు. మరోవైపు బొత్స సత్యనారాయణ సైతం తన కుమార్తెను విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికల్లో బరిలో నిలిపేందుకు ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను టీడీపీలో చేరడం విజయనగరం రాజకీయాలలో హాట్ టాపిక్‌గా మారింది.




### 13 రోజుల చిన్నారికి
# పాస్ పోర్టు

ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 8(వార్త):"అతి పిన్న వయసులో పాస్ పోర్ట్ పొందిన చిన్నారి" గా వజ్రపు అగస్త్య ప్రిన్సీ ప్రపంచ రికార్డు సాధించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా లోని ఇచ్ఛాపురానికి చెందిన వజ్రపు అగస్థ్య ప్రిన్సీ కేవలం 13 రోజుల వయసులోనే పాస్ పోర్టు పొందడం ద్వారా ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. 2026 జూన్ 12న ఈ రికార్డు నమోదైంది. గతంలో 19 రోజుల వయసున్న చిన్నారి పేరిట ఉన్న రికార్డును అధిగమించి, కేవలం 13 రోజాల వయసులో నే పాస్ పోర్టు పొందిన చిన్నారిగా అగస్థ్య ప్రిన్సీ సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొంది. ఈ ఘనతను ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్ట్స్ ప్రపంచ రికార్డుగా గుర్తించింది. తండ్రి వజ్రపు ఆశిష్ లండన్‌లో బిజినెస్ చేస్తున్నారు. భార్య మాధురి కూడా లండన్ లో ఉంటున్నారు. ప్రముఖ వ్యాపార వేత్త సామాజిక కార్యకర్త వజ్రపు వెంకటేష్ అనూష దంపతుల మనుమరాలు. అగస్త్య అమ్మమ్మ గారింట్లో రాజమండ్రిలో జన్మించింది. ఈ ఏడాది మే 30న జన్మించగా జూన్ 12న పాస్ పోర్ట్ పొందింది. లండన్‌కి తల్లిదండ్రులు తో బుధవారం తిరుగు ప్రయాణం అవుతుంది.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఉద్దానాన్ని విధ్వంసం చేయొద్దు

- కార్గో ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలి
- కళ్లకు గంతలు కట్టి నిరసన తెలిపిన కార్గో ఎయిర్‌పోర్ట్ బాధిత గ్రామాల రైతులు



**మందస, సెప్టెంబరు 8(వార్త):** ఉద్దానం ప్రాంతంలోని మందస, వజ్రపు కొత్తూరు మండలాల్లో కార్గో ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదనకు వ్యతిరేకంగా గత ఆగస్టు 25వ తేదీన కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రభావిత గ్రామాల్లో మంగళవారం బాధిత రైతులు కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. పచ్చని ఉద్దానాన్ని విధ్వంసం చేసే కార్గో ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదనను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాధిత గ్రామాల రైతులు మాట్లాడుతూ మేము కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్నామంటే ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని. అభివృద్ధి పేరుతో మా భూములను, మా జీవనాధారాన్ని నాశనం చేయడం ఎంతవరకు సమంజసం? అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. ఉద్దానం ప్రాంతంలోని పచ్చని పంట పొలాల్లో కొబ్బరి, జీడి, పనస, మునగ, మామిడి వంటి ప్రధాన పంటలతో పాటు మిర్చి, వంకాయ, టమాట, కంద దుంపలు తదితర అంతర పంటలను పండిస్తూ వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. ఇంతటి సారవంతమైన వ్యవసాయ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు, మార్కెటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తే ఉద్దానం రైతుల ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడుతుందన్నారు. కానీ విధ్వంసకరమైన ప్రాజెక్టుల పేరుతో మా స్థిరాస్తి భూములను కోల్పోయే పరిస్థితి కల్పించడం అత్యంత బాధాకరమన్నారు. గత రెండు సంవత్సరాలుగా భూబాధిత రైతులు నిరంతరంగా పోరాటం చేస్తున్నా, ప్రభుత్వం ఇప్పటికైనా మా ఆవేదనను, మా న్యాయమైన డిమాండ్లను గుర్తించాలన్నారు. ఇటీవల పత్రికలలో ఏపీఏడీసీఎల్ 1,647 ఎకరాల భూమిని గుర్తించినట్లు వచ్చిన వార్తలు బాధిత రైతుల్లో మరింత ఆందోళన కలిగించాయన్నారు. ఈ వార్తలను బాధిత రైతులంతా ఐక్యంగా ఖండిస్తున్నాం. ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అభివృద్ధి పేరుతో మా పూర్వీకుల భూములను లాక్కొని కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తే మాత్రం చూస్తూ ఊరుకోబోమని, మా భూములు–మా జీవనాధారం–మా భవిష్యత్తు కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వంపై మరింత బలమైన పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. మీలగంగువాడ గ్రామంలో పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, మాజీ సర్పంచ్ పొట్టి ధర్మారావు ఆధ్వర్యంలో, బేతాళపురం గ్రామంలో కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ మీడియా వింగ్ కన్వీనర్ బత్తిని లక్ష్మణ్, మడియా పురుషోత్తం ఆధ్వర్యంలో, ఒంకులూరు, చీపురుపల్లి గ్రామాల్లో పోరాట కమిటీ ప్రధాన కార్యదర్శి జోగి అప్పారావు, వాసుపల్లి సాంబమూర్తి, ఎరుపల్లి ధనరాజు ఆధ్వర్యంలో, బిడిమి గ్రామంలో పోరాట కమిటీ నాయకులు దున్న హరికృష్ణ, తెప్పల గున్నయ్య ఆధ్వర్యంలో ఇతర కార్గో ఎయిర్‌పోర్ట్ ప్రభావిత గ్రామాల్లో రైతులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

## గ్రామ గ్రామాన అక్షరాంధ్ర వారోత్సవాలు

**మందస, సెప్టెంబరు 8(వార్త):** అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకొని మందస మండలంలోని గ్రామ గ్రామాన మహిళా సంఘ సభ్యులు రంగవల్లులు తో అక్షరాంధ్ర వాలంటీర్స్, లెర్నర్స్ కు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. సెప్టెంబర్ 8న ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మందస, లోహరిబంద, రాంపురం, బిడిమి, నారాయణపురం తదితర అన్ని గ్రామాల్లో మహిళా సంఘాలు అక్షరాస్యత ప్రాధాన్యత పై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు నిర్వహించి, అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్లు బాలకృష్ణ, ముఖలింగం, మంగమ్మ, గ్రామ సంఘం ప్రతినిధులు, వి.ఓ.ఏ. లు, అక్షరాంధ్ర వాలంటీర్స్, లెర్నర్స్ తదితరులు పాల్గొన్నారు.



# మందసను కరవు మండలంగా ప్రకటించాలి



**మందస, సెప్టెంబరు 8(వార్త):** మందస మండలంను కరువు మండలంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి పొందర దేవేంద్ర డిమాండ్ చేశారు.

మందస మండలంలోని నర్సింగపురం, కళింగనగర్, పాతకోట, పెడంగో, ఉదయచంద్రాపురం, నారాయణపురం తదితర గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇప్పటికీ దమ్ములు కాలేదని నారుమడులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళింగ దళ్ రిజర్వాయర్ పూర్తిగా ఎండిపోయిందని, పక్కనే ఉన్న గడ్డలోని నీటిని తోడి రైతులు తమ పొలాల్లో వేసిన నాట్లు ఎండిపోతున్నాయన్నారు. కళింగదళ్ గడ్డపై గతంలో ఉన్న రాతి కట్టడం తిత్లి తుఫాన్ లో కొట్టుకుపోయిందని, దీంతో భూములకు అందాల్సిన నీరు రావడంలేదన్నారు. ఈ గడ్డపై అడ్డకట్ట నిర్మించాలని అనేక ధ పాలుగా జిల్లా అధికారులకు, ఐటీడీఏ పీఓకు విన్నవించుకున్నప్పటికీ పనులు జరగలేదన్నారు.

ఈ సంవత్సరం ప్రకృతి వైపరీత్యంతో కరువు వచ్చిందని, గిరిజన ప్రాంతంలో అందుబాటులో ఉన్న నీటిని ఉపయోగించుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడమే మా ప్రాంతంలో కరువుకు ప్రధాన కారణమని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మోటార్లు పెట్టుకోవడానికి ప్రభుత్వం విద్యుత్ లైన్లు మంజూరు చేయాలన్నారు. ఇప్పటికే అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న పంటలు కళ్ళముందే ఎండిపోతున్నాయని వారన్నారు. కరువు నివారణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కరువు పనులు కల్పించాలని ,గతంలో ఉన్న సాగునీటి నిర్మాణాలు పునరుద్ధరించాలని, రైతుల రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులి వ్వాలని, స్వల్పకాలిక విత్తనాలు ఉచితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో బి.బృందావనం, బికారి, సింహాద్రి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# అంగూరు సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో



- నూతన పింఛన్ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియపై సమీక్ష
- లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచన
- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ఎంపీడీవో మోహన్‌కుమార్

**సారవకోట, సెప్టెంబరు 8 (వార్త):** సారవకోట మండలం పరిధిలోని అంగూరు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో మోహన్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో ప్రస్తుతం కొనసాగుతున్న నూతన పింఛన్ లబ్ధిదారుల దరఖాస్తుల ప్రక్రియను ఆయన పరిశీలించారు. పింఛన్ల కోసం అందిన దరఖాస్తులను డిజిటల్ అసిస్టెంట్ లాగిన్‌లో పరిశీలించి, ఆన్‌లైన్ ప్రక్రియ సక్రమంగా కొనసాగుతున్న తీరును తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు సకాలంలో చేరుతున్నాయా లేదా అనే అంశంపై ఆరా తీశారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో మోహన్‌కుమార్ తెలిపారు. సచివాలయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగేలా పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని ఆయన సూచించారు.

# పింఛన్ దరఖాస్తులకు సులభతర సేవలు!

## గాంధీనగర్ సచివాలయంలో సిబ్బంది పనితీరును పరిశీలించిన వార్డు మాజీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్

**పలాస, సెప్టెంబరు 8 (వార్త):** పింఛన్ కోసం వచ్చే అర్హులైన దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సచివాలయ సేవలు అందించాలని వార్డు మాజీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ సచివాలయాన్ని ఆయన సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయానికి పింఛన్ కోసం వస్తున్న దరఖాస్తుదారులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన పత్రాలు, అర్హతల పరిశీలన తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పింఛన్ కోసం వచ్చే వృద్ధులు, ఇతర అర్హులైన దరఖాస్తుదారులతో సిబ్బంది ఓపికగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులకు చేరేలా క్షేత్రస్థాయిలో సేవలు మరింత సమర్థంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు నేరుగా ప్రభుత్వ సేవలు అందించే సచివాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం, స్పందనాత్మకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ దరఖాస్తు ప్రక్రియపై అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని అన్నారు.



# వినాయక మండపాలపై సమన్వయం

- ఆర్డీవో అప్పలరాజు

**పలాస, సెప్టెంబరు 8 (వార్త):** వినాయక చవితి సందర్భంగా పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేయనున్న వినాయక మండపాల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని పలాస ఆర్డీవో అప్పలరాజు ఆర్. సూచించారు. మండపాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, విద్యుత్ సరఫరా, అగ్నిప్రమాదాల నివారణ, ఫైర్ సేఫ్టీ, ప్రజల భద్రత తదితర అంశాలపై మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. పలాస ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో అప్పలరాజు ఆర్. అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పలాస రెవెన్యూ డివిజన్‌లోని వివిధ మండలాలతో పాటు పలాస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీల పరిధిలో ఏర్పాటు చేయనున్న మండపాల వద్ద భద్రతా చర్యలు, మండపాల వెడల్పు, అన్నప్రసాదం పంపిణీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించారు. మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల అనుమతులు తీసుకోవాలని, విద్యుత్ సరఫరా విషయంలో జాగ్రత్తలు పాటించాలని, అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్ సేఫ్టీ చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. పండుగ సందర్భంగా భక్తులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాఖల మధ్య సమన్వయంతో చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో పలాస డీఎస్పీ భవాని, సీఐలు, ఎస్ఐలు, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ అధికారులు, విద్యుత్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు, పలాస మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం మున్సిపల్ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఏపీటీపీసీకి కొత్త దిశ..

# ఆదాయమే లక్ష్యంగా బోర్డు నిర్ణయాలు

**- ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు అధ్యక్షతన 66వ బోర్డు డైరెక్టర్ల సమావేశం**

**- బలోపేతం, ప్రభుత్వ విభాగాలకు సరఫరాలు, ఆస్తులపై పీపీపీ వ్యూహం**




**పలాస, సెప్టెంబరు 8 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ)ను మరింత ఆర్థికంగా బలోపేతం చేసి, ప్రభుత్వ సంస్థలు--శాఖలతో వ్యాపార అనుసంధానాన్ని పెంచే దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు అధ్యక్షతన జరిగిన 66వ బోర్డు డైరెక్టర్ల సమావేశంలో సంస్థ ఆర్థిక వ్యవహారాలు, వ్యాపార విస్తరణ, ఉద్యోగుల అంశాలు, ప్రభుత్వ శాఖలకు సరఫరాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించి పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఆడిట్ ఖాతాలకు ఆమోదం2024 మార్చి 31 నాటికి ఆడిట్ చేసిన బ్యాలెన్స్‌షీట్‌ను స్టాట్యుటరీ ఆడిటర్ల నివేదికతో పాటు సి ఒఎజి వ్యాఖ్యలను పరిశీలించి బోర్డు ఆమోదించింది. 2024 కాగ్ రిపోర్ట్ లో ఎటువంటి అభ్యంతరాలు లేకుండా నిబద్దత తో పని చేసిన కార్పొరేషన్ అధికారులకు, డైరెక్టర్లు,సిబ్బందికి చైర్మన్ అభినందనలు తెలిపారు. 2023--24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన డ్రాఫ్ట్ డైరెక్టర్ల నివేదిక, అనుబంధాలను కూడా ఆమోదించారు. అడ్జర్న్ 55వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహణకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటీసుకు ఆమోదం తెలిపి, ఈ నెల 18న ఏపీటీపీసీ కార్యాలయంలో ఏజీఎం నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వ శాఖలతో వ్యాపార అనుసంధానంకార్పొరేషన్ వ్యాపార కార్యకలాపాలను ప్రభుత్వ విభాగాలతో అనుసంధానించే చర్యలకు బోర్డు ప్రాధాన్యం ఇచ్చింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పి ఆర్‌డఆర్ డి శాఖలకు వైట్ వోవ్ పేపర్, పింక్ వోవ్ పేపర్ సరఫరా చేయడం, ప్రభుత్వ సంక్షేమ శాఖలకు నోట్‌బుక్‌ల తయారీ కోసం 190 మెట్రిక్ టన్నుల క్రీమ్ వోవ్ పేపర్‌ను కొనుగోలు చేయడానికి ఆమోదం తెలిపారు. ఇది కేవలం కొనుగోలు వ్యవహారంగా కాకుండా.. ప్రభుత్వ శాఖల అవసరాలను ఏపీటీపీసీ వ్యాపార కార్యకలాపాలతో అనుసంధానించి సంస్థకు నిరంతర ఆదాయ మార్గాలను సృష్టించాలనే వ్యూహంలో భాగంగా చూడవచ్చని అధికార వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితి పెంపు అనుగుణంగా కార్పొరేషన్, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచే నిర్ణయానికి కూడా బోర్డు ఆమోదం తెలిపింది. ఆర్థిక శాఖ జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబర్.45, ఫైనాన్స్ ( హెచ్ ఆర్. డిపార్ట్మెంట్ , 02.07.2026ను అనుసరించి ఈ నిర్ణయాన్ని అమలు చేయడానికి ఆమోదం లభించింది. 2023--24 ఆర్థిక సంవత్సరానికి సెక్రటేరియల్ ఆడిటర్లుగా ఎం /ఎస్ ఎసన్ అసోసియేట్స్ , కంపెనీ సెక్రెటరీస్ నియామకాన్ని ధ్రువీకరించారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సేల్స్ పాలసీకి కూడా బోర్డు ఆమోదం తెలిపింది. సిమెంట్ కొనుగోళ్లపై చైర్మన్ ప్రత్యేక దృష్టిసమావేశంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అంశాల్లో ప్రభుత్వ అనుసంధాన సంస్థలు, ప్రభుత్వ శాఖలు సిమెంట్ అవసరాలను ఏపీటీపీసీ ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్న ప్రతిపాదన ఒకటి.ప్రభుత్వ విభాగాలు, అనుసంధాన సంస్థలు పెద్ద మొత్తంలో చేసే సిమెంట్ కొనుగోళ్లలో ఏపీటీపీసీకి అవకాశం కల్పిస్తే, ఆ వ్యాపారం ద్వారా కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందని చైర్మన్ వజ్జ బాబూరావు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ప్రభుత్వానికి మరోసారి లేఖ రాయాలని ఆయన కోరారు. ఆస్తులు ఖాళీగా ఉండకూడదు.. ఆదాయ వనరులుగా మారాలి!ఏపీటీపీసీకి ప్రస్తుతం ఉన్న ఆస్తులను కేవలం నిర్వహణకు పరిమితం చేయకుండా, వాటి వాణిజ్య సామర్థ్యాన్ని వినియోగించుకోవాలని చైర్మన్ సూచించారు. పీపీపీ విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని వినియోగించుకుని సంస్థ ఆస్తుల ద్వారా ఆదాయం సమకూర్చేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. సమావేశానికి చైర్మన్ వజ్జ బాబూరావు, వైస్ చైర్మన్ ఎండీ శేఖర్ బాబు, ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరీ ఆదినారాయణ, జేడి ఇండస్ట్రీస్ జి.కృష్ణారావు, డిప్యూటీ సెక్రటరీ ఇండస్ట్రీస్ హనుమంతరావు, ఏపీటీపీసీ జీఎం హనుమనాయక్, కంపెనీ సెక్రటరీ కరుణాకర్, అకౌంట్స్ మేనేజర్ శ్రీరామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పారదర్శకంగా పట్టాదారు పాసు పుస్తకాలు

**- టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన**

**మందస, సెప్టెంబరు 8(వార్త):** రైతులకు పారదర్శకంగా పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతోందని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. మందస మండలంలోని నర్సింగపురంలో రాజముద్ర పట్టాదారు పాస్ పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బావన దుర్యోధన మాట్లాడుతూ రైతుల ఆస్తులకు భద్రత కల్పించడమే లక్ష్యంగా, ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా అధికారిక రాజముద్రతో కూడిన కొత్త పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందజేస్తోంది. ప్రతీ రైతుకు తన భూమిపై సర్వహక్కులు భద్రంగా ఉండేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాల చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్ బి.శ్రీహరి, మందస మండల కూటమి ముఖ్య నాయకులు, సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## ఉప్పరపేట పాఠశాల శ్లాబ్ సమస్యపై ఎంఈవో పరిశీలన

**- పాఠశాల ప్రాంగణంలో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నట్లు ఫిర్యాదు**

**- సమస్యను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంఈవో వెల్లడి**

**- విద్యార్థుల భద్రతపై ఉపాధ్యాయులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచన**

**నరసన్నపేట, సెప్టెంబరు 8 (వార్త):** ఉప్పరపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్లాబ్‌కు సంబంధించిన పెచ్చులు ఊడిపడుతుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాఠశాల ఉపాధ్యాయుడు కామేశ్వరరావు మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సమస్యపై స్పందించిన ఎంఈవో మంగళవారం ఉప్పరపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. స్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడుతున్న ప్రాంతాలను పరిశీలించి పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనం, ప్రాంగణానికి సంబంధించిన సమస్యను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంఈవో తెలిపారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలోకి ప్రవేశించే సమయంలో, బయటకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రమాదానికి అవకాశం ఉన్న ప్రాంతాలకు విద్యార్థులు వెళ్లకుండా పర్యవేక్షించాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

## మర్రిపాడు పాఠశాలలో..

# మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ



**పలాస, సెప్టెంబరు 8 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలంలోని గరుడబద్ర పంచాయతీ పరిధి మర్రిపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులకు మంగళవారం భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు మంజూరైన పనులను పంచాయతీ పెద్దలు, స్థానికుల సమక్షంలో ప్రారంభించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంపై గ్రామస్థులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ౦

నిర్మాణాలు పూర్తయితే విద్యార్థులకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, మౌలిక వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రాధాన్యమిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని పంచాయతీ పెద్దలు తెలిపారు. మంజూరైన పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షుడు కోనారి గణపతి, పీఏసీఎస్ డైరెక్టర్ రాపాక శాంతమూర్తి, మాజీ అధ్యక్షుడు మురిపింటి నారాయణ, కె.మోహనరావు, కె.వల్లభరావు, ఎస్.భీమారావు, కె.గణపతి తదితరులు పాల్గొన్నారు.

## చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించిన ఎస్ఈ

**- నరసన్నపేట మేజర్ పంచాయతీలో ఆకస్మిక తనిఖీ**

**- కేంద్రం పూర్తిస్థాయిలో వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం**

**- నిర్వహణ, పనితీరుపై అధికారులకు పలు సూచనలు**

**నరసన్నపేట, సెప్టెంబరు 8 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీకి సంబంధించి ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ నగేశ్‌బాబు మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. మండల పంచాయతీరాజ్ శాఖ అధికారులతో పాటు మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి ఈవో పి.జగన్మోహన్‌రావుతో కలిసి కేంద్రంలోని పరిస్థితులను పరిశీలించారు. కేంద్రంలో ప్రస్తుతం ఏ విధంగా పనులు నిర్వహిస్తున్నారనే విషయంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరణ, విభజనతో పాటు కేంద్రం నిర్వహణకు సంబంధించిన అంశాలపై వివరాలు తెలుసుకుని, పనితీరును మెరుగుపరిచేందుకు అవసరమైన సూచనలు చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రం తప్పనిసరిగా పూర్తిస్థాయిలో వినియోగంలో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేంద్రంలో చేపడుతున్న పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, పరిశుభ్రత, నిర్వహణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కేంద్రం ద్వారా ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టి పంచాయతీ పరిధిలో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో కొనసాగుతున్న పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు అందజేశారు.



## బుచ్చిపేట పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

**- విద్యార్థుల బోధన సామర్థ్యాలపై ఎంఈవో శాంతారావు పరిశీలన**

**- వినూత్న బోధనా విధానాలు అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచన**

**- శిథిలావస్థ భవనం తొలగింపునకు చర్యలు చేపట్టాలని ఆదేశం**

**నరసన్నపేట, సెప్టెంబరు 8 (వార్త):** నరసన్నపేట మండల విద్యాశాఖాధికారి శాంతారావు బుచ్చిపేట ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఎంఈవో, విద్యార్థులకు అందుతున్న బోధన తీరుపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సంప్రదాయ బోధనా విధానాలతో పాటు వినూత్న పద్ధతులను అవలంబిస్తూ విద్యార్థుల్లో అభ్యసన ఆసక్తిని పెంపొందించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి విద్యా స్థాయిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణాన్ని కల్పించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉన్న శిథిలావస్థ భవనాన్ని పరిశీలించారు. శిథిల భవనం కారణంగా విద్యార్థుల భద్రతకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. సంబంధిత అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి భవనాన్ని కూల్చివేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా పరిశీలించిన ఆయన అక్కడి నిర్వహణ, పిల్లలకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యా, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఎన్టీఆర్ పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించిన ఆర్డీవో

- నరసన్నపేట సచివాలయంలో ఆకస్మిక తనిఖీ
- దరఖాస్తుల స్వీకరణ తీరుపై అధికారులతో ఆరా
- లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం

**నరసన్నపేట, సెప్టెంబరు 8 (వార్త):** ఎన్టీఆర్ పెన్షన్లకు సంబంధించి నూతన దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో నరసన్నపేటలో లబ్ధిదారులు సచివాలయ కేంద్రాలకు చేరుకుని దరఖాస్తులు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం నరసన్నపేట సచివాలయంలో కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష అకస్మికంగా పరిశీలించారు. సచివాలయంలో దరఖాస్తులను ఏ విధంగా స్వీకరిస్తున్నారు, దరఖాస్తుదారులకు అవసరమైన సమాచారం అందిస్తున్నారా, ప్రక్రియ సక్రమంగా జరుగుతోందా అనే అంశాలపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణలో పారదర్శకత పాటించాలని, ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



చూపాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నూతనంగా దరఖాస్తుల స్వీకరణకు అవకాశం కల్పించడంతో అర్హులైన పలువురు సచివాలయ కేంద్రాలకు చేరుకుని దరఖాస్తులు సమర్పిస్తున్నారని అధికారులు తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియ సజావుగా సాగేలా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

## నాయుడు గారి రాజశేఖర్ జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

- శ్రీముఖలింగంలో రాజీవ్ భవన్, క్యాంప్ కార్యాలయంలో వేడుకలు
- వృద్ధులు, అభాగ్యులకు వస్త్రాలు, దుప్పట్లు, పండ్ల పంపిణీ
- కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపు

**జలుమూరు, సెప్టెంబరు 8 (వార్త):** జలుమూరు మండలం శ్రీముఖలింగం గ్రామంలోని రాజీవ్ భవన్, క్యాంప్ కార్యాలయంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర



నాయకులు, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం 2024 ఎంపీ అభ్యర్థి నాయుడుగారి రాజశేఖర్ 41వ జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నాయుడుగారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 'గ్రామ సేవ--రామ సేవ' లక్ష్యంతో సమాజ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం వృద్ధులు, నిరుపేదలు, అభాగ్యులకు వస్త్రాలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సేవా కార్యక్రమాల ద్వారా అవసరంలో ఉన్న వారికి చేయూత అందించడమే ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి విందు కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాజశేఖర్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## పెన్షన్ దరఖాస్తులకు టీడీపీ నేతల సహకారం



**పలాస, సెప్టెంబరు 8 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన నూతన పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అర్హులకు సహకరించేందుకు టిడిపి మండల యువత అధ్యక్షులు కిక్కిరి ఢిల్లీ రావు (కేడిఆర్) ఆధ్వర్యంలో బొడ్డపాడు గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా దరఖాస్తుల స్వీకరణ, అవసరమైన వివరాల సేకరణ తదితర ప్రక్రియల్లో ప్రజలకు సహకరించారు. దరఖాస్తు ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సూచనలు, సహాయాన్ని అందిస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే తమ లక్ష్యమని అన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ పనిచేస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థి నాయకుల ప్రమాణస్వీకారం




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 8 (వార్త):** ఇచ్ఛాపురం జ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఇన్వెస్టిట్యూర్ సెర్మని (విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవ వేడుక) పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వాహణాధికారి జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ పీపుల్ లీడర్ తోపాటు వివిధ విద్యార్థి విభాగాలకు నాయకులను నియమించారు. ఎనిమిది హౌస్ లను ఏర్పాటు చేసి వాటికి కూడా నాయకులను ప్రకటించారు. నాయకులుగా నియమితులైన విద్యార్థులకు జోహార్ ఖాన్ బ్యాడ్జిలను అందించి,వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జోహార్ ఖాన్ మాట్లాడుతూ.... విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను పెంపొందించే ఉద్దేశంతో విద్యార్థులకు నాయకత్వ బాధ్యతను అప్పగించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో నాయకులుగా ఎదగాలనుకునే విద్యార్థులు ఈ బాధ్యతలను ఒక అవకాశంగా తీసుకోవాలని సూచించారు. ఒక వ్యక్తి జీవితంలో సాధించే విజయాలకు నాయకత్వ లక్షణాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని, లక్ష్యాల సాధనలో ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐబి పండ, ప్రధానోపాధ్యాయురాలు ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్, అదనపు పరిపాలన అధికారిని రషీదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

**పలాస, సెప్టెంబరు 8 (వార్త):** పలాస మున్సిపాలిటీ పరిధిలోని పాత 18వ, ప్రస్తుత 21వ వార్డుల్లో అర్హులైన పేదలకు కొత్త పింఛన్ల మంజూరు కోసం మంగళవారం దరఖాస్తులు స్వీకరించి, ఆన్లైన్లో నమోదు చేశారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు టీడీపీ సీనియర్ నాయకుడు, విద్యావేత్త పైల చక్రధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల వార్డులో ఇంటింటి సర్వే నిర్వహించి పింఛను అందని అర్హులను గుర్తించారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, డయాలసిస్, కిడ్నీ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి నుంచి ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా, వైద్య ధ్రువపత్రాలను సేకరించి సచివాలయ సిబ్బంది సహకారంతో దరఖాస్తులు నమోదు చేశారు. ఈ సందర్భంగా పైల చక్రధర్ మాట్లాడుతూ అర్హులైన పేదలెవరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో వార్డుల వారీగా అర్హులను గుర్తించి దరఖాస్తులు చేయిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పింఛను మొత్తాన్ని రూ.4 వేలకు పెంచిందని, ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, స్థానికులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నేతాజీ వీధిలో ప్రమాదకర విద్యుత్ స్తంభాలు

- కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లతో స్థానికుల్లో ఆందోళన
- విద్యుత్ శాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందజేత
- ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని నాయకుల డిమాండ్



**నరసన్నపేట, సెప్టెంబరు 8 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని నేతాజీ వీధిలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకర స్థితిలో ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలతో పాటు విద్యుత్ వైర్లు సైతం కిందకు వేలాడుతున్నాయని, ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకటరావు, మాజీ ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు పేర్కొన్నారు. ఈ సమస్యపై మంగళవారం విద్యుత్ శాఖ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. విద్యుత్ శాఖ డీఈఈ శ్రీధర్‌కుమార్, ఏఈబీ రామ్‌చరణ్ గుప్తలకు నేతాజీ వీధిలో నెలకొన్న పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధిలోని కొన్ని విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయని, విద్యుత్ తీగలు కూడా కిందకు వేలాడుతూ ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో ఇటువంటి పరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున అధికారులు తక్షణమే స్పందించి శిథిలావస్థలో ఉన్న స్తంభాలను పరిశీలించాలని కోరారు. అవసరమైన చోట కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఏదైనా ప్రమాదం సంభవించిన తరువాత చర్యలు తీసుకునే పరిస్థితి రాకుండా ముందస్తుగా సమస్యను పరిష్కరించాలని వారు విద్యుత్ శాఖ అధికారులను కోరారు.

## సచివాలయంలో తెలుగు తమ్ముళ్ల హల్‌చల్



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 8 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు దరఖాస్తు లు స్వీకరిస్తున్న వేళ స్వర్ణ సచివాలయం లలో తెలుగు తమ్ముళ్లు హల్ చల్ చేస్తున్నారని వైస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు బలివాడ ప్రకాష్ రావు పట్నాయక్ అన్నారు. పసుపు టీ షర్టు వేసుకున్న వ్యక్తి సచివాలయం అనామక ఉద్యోగి దర్జాగా అఫీషియల్ సీట్లో కూర్చుని పని చేస్తున్నారని అన్నారు.ఇచ్ఛాపురం మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ 9 వ వార్డు కార్యకర్త రాహుల్ కుమార్ సాహు ఎన్ టీ ఆర్ భరోసా పెన్షన్ ధ్రువపత్రాలు వెరిఫికేషన్ చేసి ఒరిజినల్ ప్రభుత్వ ఉద్యోగి కి అందజేసి తాను ఓకే చేసిన దరఖాస్తులు మాత్రమే కంప్యూటరీ కరణ చేయమని హుకుం జారీ చేసే కార్యక్రమం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని 9 వ స్వర్ణ వార్డు కార్యాలయంలో జరుగుతుందని అన్నారు.అంటే అధికారులు ఏమి చేస్తున్నారు ఎటు పోతుంది ఈ రాష్ట్రంఅని ప్రశ్నించారు. ఫకీర్ పేట స్వర్ణ సచివాలయం లో ఉదయం 11 వరకు తలుపులు తెరవక పోవడం తో దరఖాస్తు దారులు ఎదురు చూపులు చూస్తున్నారని వైస్సార్సీపీ నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ సాలిన గాంధీ యాదవ్ అన్నారు. వార్డు లలో టీడీపీ ఇంచార్జ్ స్టాంప్ వేస్తేనే దరఖాస్తు లు స్వీకరిస్తున్నారని జిల్లా వైస్సార్సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతి దివ్య ఆరోపించారు.



## నరసన్నపేట ఆస్పత్రికి పెరిగిన రోగుల తాకిడి

- ఉదయం 8 గంటలకే ఓపీ కోసం క్యూ లైన్లలో రోగులు
- ఒక్కరోజే 270 మందికి పైగా రోగులకు వైద్య సేవలు
- పరీక్షల అనంతరం ఉచితంగా మందుల పంపిణీ

**నరసన్నపేట, సెప్టెంబరు 8 (వార్త):** నరసన్నపేట ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. మంగళవారం ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు వైద్య సేవల కోసం ఆస్పత్రికి చేరుకున్నారు. ఉదయం 8 గంటలకే ఓపీ నమోదు కోసం రోగులు క్యూ లైన్లలో వేచి ఉండటం కనిపించింది. ఇటీవల కాలంలో ఏరియా ఆస్పత్రిలో రోజువారీ ఓపీ సంఖ్య గణనీయంగా పెరుగుతోందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మంగళవారం ఒక్కరోజే 270 మందికి పైగా రోగులు వైద్య సేవల కోసం ఆస్పత్రికి వచ్చినట్లు ఏవో కాళీచరణ్ తెలిపారు. రోగులకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు అందుబాటులో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. రోగులకు పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన మందులను ఆస్పత్రి ద్వారా ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలు, ఉచితంగా మందులు అందుబాటులో ఉండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో ఏరియా ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రి సిబ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

## ప్రతి ఒక్కరూ సహకరించాలి




**మెళియాపుట్టి, సెప్టెంబరు 8(వార్త):** పోలీసులు చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి గ్రామాలలో ఉన్న ప్రజలు ప్రతి ఒక్కరూ సహకరించాలని పాతపట్నం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిల్లి వెంకట్రావు అన్నారు. స్థానిక మెళియాపుట్టి సబ్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ సమీర్ ఆలీ ఆధ్వర్యంలో మంగళవారం నాడు మెళియాపుట్టి మండలంలో చీపురుపల్లి గ్రామంలో పాతపట్నం సీఐ, స్థానిక ఎస్ఐ ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలతో కలిసి గ్రామంలో నెలకొన్న పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై ప్రజల వద్ద నుండి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతు గ్రామాలలోని ప్రజలు ఎవరు ఎక్కడ ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని, చట్టపరమైన నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని, అలాగే గ్రామాలలో ఉన్న యువత చెడు అలవాట్లకు లోను కాకుండా ఉండాలని, గ్రామాలలో అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన, కార్యకలాపాలు జరిగినట్లు తెలిసిన వెంటనే పోలీసుల దృష్టికి పోలీసులకు తెలియపరిచి సహకరించాలని ఆయన ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్రావు తో పాటు స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ సమీర్ అలీ పోలీస్ సిబ్బంది గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## నేత్రదానం.. కావాలి ఆదర్శం

**మందస, సెప్టెంబరు 8(వార్త):** నేత్రదానం.. ఆదర్శం కావాలని మందస మండల నేత్ర వైద్య సహాయాధికారి రోణంకి వెంకటరమణ అన్నారు. మందస మండలంలోని కుంటికోట గ్రామంలో గల నారాయణ మోడల్ స్కూల్ లో నేత్రదానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా తేది.25-8-2026 నుండి 8-9-2026 వరకు నేత్ర దాన పక్షోత్సవాలు నిర్వహించామని ఆయన తెలిపారు. శ్రీకాకుళం జిల్లా అంధత్వ నివారణ సంఘం చైర్మన్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు మేరకు నేత్రదానంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులు నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఇన్ చార్జి ప్రిన్సిపాల్ బి.సూర్య కోరారు. నేత్ర వైద్య సహాయాధికారి రోణంకి వెంకటరమణ మాట్లాడుతూ ఒక్కరి నేత్రదానం ఇద్దరికి చూపునిస్తుందన్నారు. మరణించిన వారి నుండి వారి కార్నియాను 6గంటలలోపు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమం శ్రీకాకుళం జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నేత్ర సేకరణ జరుగుతుందన్నారు. నేత్రదానం మన అందరికి ఆదర్శం కావాలని, నేత్రదానంపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. స్కూల్ లో 280 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, 16 మంది దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించామని, వీరికి కళ్లద్దాలు సిఫార్సు చెయ్యడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ, హెల్త్ సెక్రటరీ జి.ప్రసన్నలత, హెల్త్ అసిస్టెంట్ ఎస్.కాంతారావు, ఆశా ఎన్.రోహిణి, జి.పద్మలత, కె.ధనలక్ష్మి, ఎస్.శారద పాల్గొన్నారు.



## చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర జీవనం



**సారవకోట, సెప్టెంబరు 8 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులు ప్రతిరోజూ భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులను పరిశుభ్రంగా శుభ్రం చేసుకోవాలని అన్నుపురం ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేశ్ సూచించారు. సారవకోట మండలం అన్నుపురం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణలో చేతులు శుభ్రంగా ఉంచుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. భోజనం చేసే ముందు సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవడం ద్వారా అనేక రకాల వ్యాధుల బారిన పడకుండా నివారించవచ్చని హెచ్‌ఎం గణేశ్ తెలిపారు. పరిశుభ్రమైన చేతులతో ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ఆహారం జీర్ణం కావడానికి కూడా ఇది దోహదపడుతుందని విద్యార్థులకు వివరించారు. మండల విద్యాశాఖాధికారుల సూచనల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పరిశుభ్రత అలవాట్లను పెంపొందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడవచ్చని పేర్కొన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్న భోజనానికి ముందు విద్యార్థులు చేతులను పరిశుభ్రంగా కడుక్కొని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఆయన సూచించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546